సాక్షి అనకాపల్లి

శనివారం | 21 | డిసెంబర్ | 2024



జోరు వానలో ముందస్తు వేడుక

సత్యనారాయణపురంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన రెడ్డి జన్మదిన వేడుకలను ముందస్తుగా శుక్రవారం రాత్రే నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కేకును కట్ చేసి పంపిణీ చేశారు. జగనన్నకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ నినాదాలు చేశారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు.

- అనకాపల్లి

న్యూస్‌రీల్

నేడు తాండవ చైర్మన్ ఎన్నిక

నర్సీపట్నం: జిల్లాలో మేజర్ ప్రాజెక్టు అయిన తాండవ జలాశయానికి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక శనివారం జరగనుంది. ఈ ప్రాజెక్టు కింద 52 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఆయకట్టు లో ఎక్కువ భాగం అనకాపల్లి జిల్లాలో, కొంత భాగం కాకినాడ జిల్లాలో ఉంది. జలాశయం పరిధిలోని ఐదు డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఈ నెల 17న ఎన్నికలు జరిగాయి. నర్సీపట్నం డీఈ కార్యాలయంలో మూడు డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నిక జరగగా, మిగిలిన రెండు కమిటీలకు కాకినాడ జిల్లా పరిధిలో జరిగాయి. డిస్ట్రిబ్యూటరీ కమిటీ సభ్యులు శనివారం చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకోనున్నారు. ఈ ఎన్నికను నర్సీపట్నం తాండవ జలాశయం డీఈ కార్యాలయంలో నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఎన్నిక లాంఛనమే.. :

నాతవరం: జిల్లాలో మీడియం జలాశయాలైన రైవాడ, పెద్దేరు, కోనాం ప్రాజెక్టుల చైర్మన్ల ఎన్నిక కూడా శనివారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మీడియం ప్రాజెక్టులకు డీసీ మెంబర్లు ఉండరు. నేరుగా నీటి సంఘాల అధ్యక్షులే ప్రాజెక్టు కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లను ఎన్నుకుంటారు. వైఎస్సార్‌సీపీ పోటీ చేయకుండా నీటి సంఘాల ఎన్నికలను బహిష్కరించిన విషయం తెలిసిందే. దీంతో మేజర్, మీడియం ప్రాజెక్టు కమిటీల్లో కూటమి అభ్యర్థులే గెలుపొందడంతో శనివారం జరిగే చైర్మన్లు, వైస్ చైర్మన్ల ఎన్నికలు లాంఛనప్రాయమే కాగలదు. తాండవ ప్రాజెక్టు చైర్మన్‌గా కరక సత్యనారాయణ పేరును ఈనెల 19న మర్రిపాలెంలో జరిగిన సభలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రతిపాదించారు.

ఆంధ్రా ఖోఖో జట్టు కెప్టెన్‌గా తెనుగుపూడి గురుకుల విద్యార్థి

- నేటి నుంచి అయోధ్యలో జాతీయ స్థాయి పోటీలు



కెప్టెన్ అజయ్

దేవరాపల్లి: తెనుగుపూడిలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయం ఇంటర్ విద్యార్థి ఆంధ్ర ఖోఖో జట్టుకు కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టాడు. స్థానిక గురుకుల కళాశాలలో ఇంటర్ చదువుతున్న గాలి అజయ్ అండర్-17 ఖోఖో జట్టుకు నాయకత్వం వహిస్తున్నాడు. ఇతని సారథ్యంలో 12 మంది సభ్యులతో కూడిన రాష్ట్ర జట్టు ఈ నెల 21 నుంచి ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అయోధ్యలోని అంబేడ్కర్ క్రీడా మైదానంలో జరుగనున్న జాతీయ స్థాయి ఖోఖో పోటీలలో పాల్గొంటుంది. జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో మన తెలుగువాడు సత్తా చాటి, విజయం సాధించి తీరుతారని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయాల ఉమ్మడి విశాఖ జిల్లా సమన్వయకర్త ఎస్.రూపావతి ఆశాభావం వ్యక్తం చేశారు. తమ విద్యార్థి అజయ్ ఎంపిక ఆనందంగా ఉందని స్థానిక గురుకులం ప్రిన్సిపాల్ పి.రఘు, వ్యాయామ ఉపాధ్యాయుడు జి.తరుణేశ్వరరావు తెలిపారు.

విద్యా విప్లవం.. గతమెంతో ఘనం!

జగనన్న పాలనలో పేద పిల్లల చదువులకు పెద్దపీట

- విప్లవాత్మక మార్పులతో సత్ఫలితాలు
- పాఠశాలల్లో పూర్తిస్థాయి వసతులు
- కార్పొరేట్‌కు తలపించేలా విద్యా ప్రమాణాలు
- అందుబాటులోకి డిజిటల్ విద్య
- మంచి భవిష్యత్తుకు బాటలు వేసిన గత వైఎస్సార్‌సీపీ సర్కారు
- విద్యారంగాన్ని విస్మరించిన నేటి కూటమి ప్రభుత్వం



గత ఏడాది డిసెంబర్ 21న చింతపల్లిలో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి



గత ఏడాది డిసెంబరు 21న కె.కోటపాడులో జరిగిన కార్యక్రమంలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసిన నాటి డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

బైజూస్ ట్యాబ్‌ల పంపిణీ	
2022-23	19,250
2023-24	15,201

- నాడు - నేడు పథకం కింద మొదటి, రెండు విడతల్లో 1057 ప్రభుత్వ పాఠశాలను రూ.273.73 కోట్లతో ఆధునికీకరించారు.
- విద్యా దీవెన.. మూడేళ్లలో 92,792 మంది విద్యార్థుల ఫీజుల కోసం రూ.60.99 కోట్లు చెల్లించారు.
- విదేశీ విద్య దీవెన.. రెండు విడతల్లో 15 మందికి రూ.60,79,068ల సాయం అందించారు.

విద్యారంగంపై పెట్టే ఖర్చు జాతి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తుందని నమ్మిన దార్శనికుడు.. సామాన్యులకు సైతం కార్పొరేట్ చదువులను అందుబాటులోకి తెచ్చిన విద్యాప్రదాత.. తన పుట్టిన రోజైన డిసెంబరు 21న ప్రతి ఏటా 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసి అత్యున్నత ప్రమాణాలను అందుబాటులోకి తెచ్చిన క్రాంతిదర్శి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్లు విద్యారంగానికి స్వర్ణయుగం.. ఆనాడు చదువులకే అగ్రతాంబూలం.. మరి నేటి కూటమి ప్రభుత్వంలో ఒక్క పైసా కూడా విదల్చని నిర్లక్ష్యం.. భవిష్యత్తు అగమ్యగోచరం.

సాక్షి, అనకాపల్లి:

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విద్యారంగంలో తీసుకొచ్చిన సంస్కరణలు పేదలపాలిట వరం. ఆర్థిక పరిస్థితి కారణంగా ఏ ఒక్క పేద విద్యార్థి చదువుకు దూరం కాకూడదన్నదే మాజీ సీఎం వైఎస్ జగన్ సిద్ధాంతం. తల్లిదండ్రులు పిల్లల్ని పనికి కాకుండా బడికి పంపాలి. అందుకే అమ్మఒడి పథకం ద్వారా తల్లుల ఖాతాల్లో ఏటా రూ.15 వేలు చొప్పున నాలుగు విడతల్లో రూ.60 వేలు జమ చేశారు. విద్యార్థులకు విద్యా దీవెన, వసతి దీవెన అందించారు.



అమ్మ ఒడి		
సంవత్సరం	విద్యార్థులు	లబ్ధి (రూ.కోట్లలో)
2019-20	1,61,915	242.87
2020-21	1,60,914	241.37
2021-22	1,58,722	238.00
2022-23	1,50,870	226.30



విద్యా కానుక		
సంవత్సరం	విద్యార్థులు	లబ్ధి (రూ.కోట్లలో)
2020-21	3,17,202	48.54
2021-22	3,17,209	48.56
2022-23	3,69,733	61.66

విదేశాల్లో ఉన్నత చదువులు అభ్యసించే విద్యార్థులకు విదేశీ విద్యా దీవెన ద్వారా లక్షలాది రూపాయల సాయం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు 'గోరు ముద్ద' పేరిట రోజుకొక మెనుతో పౌష్టికాహారం, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ, ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన వంటి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. అంతేకాకుండా 'నాడు- నేడు' పథకంలో ప్రభుత్వ స్కూళ్లను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేశారు.

జగన్‌మోహన్‌రెడ్డి విధానాలను దేశమంతా ప్రశంసించింది. కానీ ఇప్పుడు.. ఈ పథకాలన్నీ పడకేశాయి. అమ్మ ఒడి బదులు తల్లికి వందనం పేరిట ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ రూ.20 వేలు చొప్పున ఇస్తామని ఎన్నికల ముందు ప్రకటించి, ఒక్కరికీ ఒక్క పైసా ఇవ్వలేదు. ఫీజ్ రీయింబర్స్‌మెంట్ తదితర పథకాలను నిర్లక్ష్యం చేస్తున్నారు.



నక్కపల్లిలో విద్యార్థులకు డిజిటల్ బోధన

ఈ ఏడాది ట్యాబ్ అందుకుంటానని ఆశించాను



నేను సమీకృత వసతి గృహంలో ఉంటూ 8వ తరగతి చదువుకుంటున్నాను. ప్రతి ఏటా మాజీ సీఎం జగన్ మామయ్య పుట్టిన రోజున 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ ట్యాబ్‌లు పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తోంది. ట్యాబ్‌లతో విద్యార్థులకు దృశ్య రూపంతో కూడిన విద్య అందుతుండేది. ఈ సంవత్సరం నేను అందుకుంటానని ఆశించాను. ప్రస్తుతం ఆ పథకాన్ని కొనసాగించే పరిస్థితి కనిపించడం లేదు. **-పి.వెంకటరమణ**, 8వ తరగతి, ఎ.కోడూరు, కె.కోటపాడు మండలం

ఉచితంగా ట్యాబ్‌లు ఇచ్చారు



పిల్లలకు ట్యాబ్‌లు కొనుగోలు చేసి ఇచ్చే ఆర్థిక స్తోమత మాకు లేదు. గత ప్రభుత్వంలో ఒక్క పైసా ఖర్చు లేకుండా మా పిల్లలకు ఉచితంగా ట్యాబ్‌లు పంపిణీ చేశారు. నూతన టెక్నాలజీ విధానం, ఆన్‌లైన్ చదువులపై అవగాహన కల్పించేవారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో అప్పటి సదుపాయాలు కనిపించడం లేదు. ఇప్పుడు పాఠశాల విధానం అంతా అయోమయంగా ఉంటోంది.

- చెక్కా జోగిరాజు, నాతవరం గ్రామం

ఇంగ్లిష్ మీడియం అమలు చేయాలి



జగనన్న ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లిష్ మీడియం అమలు చేయడంతో ఎంతో ఆనందపడ్డాం. ప్రైవేటు స్కూల్స్‌లో చదివించే స్థోమత లేని మాలాంటి సామాన్యుల పిల్లలు దర్జాగా ఇంగ్లిష్‌లో చదువుకునే అవకాశం కల్పించారు. కానీ ప్రస్తుతం ఇంగ్లిష్ మీడియంను సక్రమంగా అమలు చేయడం లేదు. నా కుమార్తె పదో తరగతి చదువుతోంది. ఇంగ్లిష్ మీడియంను పక్కాగా అమలు చేయాలని కోరుతున్నాను.

-కొరుపోలు కృష్ణవేణి, దేవరాపల్లి

హామీలు ఇచ్చి నట్టేట ముంచారు



చంద్రబాబు ప్రభుత్వంలో ఎన్నికల హామీలు అమలు కావడం లేదు. గతంలో సీఎంగా పనిచేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఏటా అమ్మ ఒడి సకాలంలో వేసేవారు. పిల్లల ఫీజులకు ఇది ఎంతో ఉపయోగపడేది. తల్లికి వందనం పథకం కింద పిల్లలందరికీ రూ.20 వేలు చొప్పున ఇస్తామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక కనీసం పట్టించుకోలేదు. పెద్దలే ఇలా మాట తప్పి మోసగిస్తే ఎలా? మా గోడు ఎవరికి చెప్పుకోవాలి?

-బొట్టా లక్ష్మి, గొలుగొండ గ్రామం

మొక్కుబడిగా మధ్యాహ్న భోజనం



జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా సేవలందించిన కాలంలో ప్రవేశపెట్టిన గోరుముద్ద పథకం విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకుంది. పేరుకు తగ్గట్టు రుచికరమైన ఆహార పదార్థాలు అందించడంతో పిల్లలకు బలవర్ధకమైన ఆహారం అందేది. విద్యార్థుల హాజరు శాతం పెరగడానికి ఇది దోహదపడేది. ఇప్పుడు మధ్యాహ్న భోజనం మొక్కుబడిగా సాగుతోంది. మళ్లీ పూర్వ వైభవం తేవాలి.

-ఆడారి గణపతి అచ్చియ్యనాయుడు, మునగపాక

కన్నీటి ముంపులో రైతన్న

- ఎడతెరిపి లేని వర్షాలు
- ఆందోళనలో అన్నదాతలు



నీటమునిగిన వరి పనలను గట్టుపై పెడుతున్న రైతు

తుమ్మపాల: జిల్లాలో రెమాల్ తుఫాన్ ప్రభావంతో వరి రైతులు తీవ్రంగా నష్టపోయారు. వరి కోతలు పూర్తయి పనలపై ఉన్న వరిని కుప్పలుగా పెట్టకముందే తుపాన్ తీవ్ర ప్రభావం చూపింది. గురువారం నుంచి ఏకధాటిగా వర్షం కురవడంతో కోసిన వరి వర్షపు నీటిలో మునిగిపోతోంది. దీంతో పనల్లో గింజ తడిసి మొలకెత్తే పరిస్థితి ఏర్పడింది. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఇలా వర్షాలపాలు కావడంతో కళ్లలో నీటిని దిగమింగుకుని చివరి ఆశతో పనలను గట్టుపై చేర్చుకుంటున్నారు. అధికారులు మండలాల్లో పర్యటించి నీట మునిగిన వరిపనల నష్టనివారణకు పలు సూచనలు చేశారు.

పెరిగిన చలి : జిల్లాలో క్షణం తీరిక లేకుండా రెండు రోజులుగా వర్షం విరుచుకుపడుతోంది. 18వ తేదీ రాత్రి మొదలైన వర్షం నేటికీ తెరిపివ్వలేదు. తీవ్ర చలిగాలులు వీచడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. వృద్ధులు, చిన్నారులు చలి తీవ్రతకు ఇబ్బందులు పడుతున్నారు. బడిపిల్లలు గురువారం పాఠశాలలకు రాకపోకలు చేయలేకపోయారు. పలు చోట్ల వర్షపునీరు చేరడంతో రోడ్లపై గోతులు నీటితో నిండిపోయాయి. గత రెండు రోజులుగా జిల్లాలో 680.4 మి.మీ. వర్షపాతం నమోదయింది. సగటున 28.4 మిల్లీమీటర్లుగా వాతవరణ శాఖ ప్రకటించింది.

మండలాల వారీగా వర్షపాతం వివరాలు

మండలం	వర్షపాతం (మి.మీ.)				
		రావికమతం	37.0	రాంబిల్లి	33.3
		అనకాపల్లి	36.9	చోడవరం	32.1
సబ్బవరం	63.5	చీడికాడ	36.7	యలమంచిలి	23.2
దేవరాపల్లి	52.5	బుచ్చెయ్యపేట	36.1	రోలుగుంట	16.6
మాడుగుల	46.4	కశింకోట	35.4	నర్సీపట్నం	14.0
కె.కోటపాడు	45.6	అచ్యుతాపురం	34.8	ఎస్.రాయవరం	13.1
పరవాడ	43.6	మునగపాక	34.3	మాకవరపాలెం	10.9

నష్ట నివారణ చర్యలు ఇవే..



సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో పండిన వరి పంట నష్టపోకుండా ఉండేందుకు అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో డ్వామా, పంచాయతీరాజ్, వ్యవసాయ శాఖ, గ్రామీణ నీటి సరఫరా, రోడ్లు భవనాలు, నీటిపారుదల శాఖ, గృహ నిర్మాణ శాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, పశు సంవర్ధక శాఖల అధికారులు, అన్ని మండలాల ఎంపీడీవోలతో వీడియో కన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యాలపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షంతో వరి గింజలు పాడవకుండా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. అన్ని మండలాల వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు సూచనలు చేయాలన్నారు. వరి గింజలు పాడవకుండా ఉప్పు ద్రావణం పిచికారీ చేయడం గురించి రైతులకు తెలియజేయాలన్నారు. పంచాయతీలు పల్లె పండుగ వారోత్సవాల్లో సీసీ, బీటీ రోడ్ల మరమ్మతులకు సంబంధించిన బిల్లులు బుధవారం సాయంత్రానికి సమర్పించాలన్నారు. డీపీవో జి.రామారావు, డీఆర్‌డీఏ పీడీ కె.శచీదేవి, హౌసింగ్ పీడీ వై.శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఈఈ కె.వి.నాయుడు, జిల్లా అబ్కారీ శాఖ అధికారి సుధీర్, డీఎంహెచ్‌వో బాలాజీ, జిల్లా పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ పి.జయంతి, జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ మోహనరావు పాల్గొన్నారు.

సఫాయి కర్మచారీల బతుకులు మారాలి

- జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు డాక్టర్ పి.పి.వావా



జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు డాక్టర్ పి.పి.వావాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్



పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారంపై అధికారుల మాట్లాడుతున్న డాక్టర్ పి.పి.వావా

తుమ్మపాల:

గ్రామ పంచాయతీలు, పాఠశాలలో పని చేసే సఫాయి కర్మచారి (పారిశుధ్య కార్మికులు)లకు కార్మిక చట్టాల ప్రకారం కనీస వేతనం అందించాలని జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు డాక్టర్ పి.పి.వావా కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్‌ను ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక ఎస్.ఆర్. శంకరన్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. పి.పి. వావా మాట్లాడుతూ సఫాయి కర్మచారిలకు ప్రభుత్వ పథకాలను అమలు చేయాలన్నారు. బ్యాంకు అధికారులు వారికి రుణాలు మంజూరు చేయాలని, దీనికి ఎటువంటి ష్యూరిటీలు అవసరం లేదని స్పష్టం చేశారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో పశువులు, కోళ్ల తదితర పెంపకం యూనిట్లు మంజూరు చేయవచ్చన్నారు. సేవా రంగంలోనూ అనేక అవకాశాలను కల్పించవచ్చని చెప్పారు. జాతీయ సఫాయి కర్మచారి ఆర్థికాభివృద్ధి సంస్థ ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. సఫాయి కర్మచారి కుటుంబ సభ్యులకు వివిధ రంగాల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రమాదవశాత్తు మరణించినప్పుడు తక్షణం కుటుంబ సభ్యులకు ఉద్యోగాన్ని కల్పించాలన్నారు. కార్మికులకు అవసరమగు దుస్తులు, బూట్లు, చేతి గ్లోవ్స్, నూనె వంటి సామగ్రిని విధిగా అందజేయాలన్నారు. హెపటైటిస్ - బి వాక్సిన్ వేయించాలని, నిర్దేశిత సమయంలో వైద్య శిబిరాలను నిర్వహించాలన్నారు. గుర్తింపు కార్డులు జారీ చేయాలని, ఇళ్లు మంజూరు చేయాలని, ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులు అందించాలని అధికారులను ఆదేశించారు.

పారిశుధ్య కార్మికులతో ముఖాముఖి మాట్లాడి వారికి అందుతున్న ప్రయోజనాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు కలెక్టర్ విజయ కృష్ణన్ డాక్టర్ పి.పి. వావాను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి, జిల్లా పరిపాలన, పరిస్థితులను వివరించారు. జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి కె.రాజేశ్వరి, డీపీవో ఆర్. శిరీషారాణి, డీఈవో జి. అప్పారావునాయుడు, లీడ్ బ్యాంక్ మేనేజర్ కె. సత్యనారాయణ, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ కె.వసంతరావు, నర్సీపట్నం, యలమంచిలి, మున్సిపల్ కమిషనర్లు, జీవీఎంసీ జోనల్ అధికారులు శాఖల వారీగా సఫాయి కర్మచారిల వివరాలు వారికి అందిస్తున్న ప్రయోజనాలు, సేవలను గురించి కమిషనుకు వివరించారు. కార్యక్రమంలో డీఆర్వో వై.సత్యనారాయణరావు, ఏఎస్పీ ఎం.దేవప్రసాద్, జిల్లా కమిటీ సభ్యులు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎస్పీ కార్యాలయంలో పోలీస్ గ్రీవెన్స్ డే



కానిస్టేబుల్ సమస్యను వింటున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ గ్రీవెన్స్ డే జరిగింది. జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది తమ సమస్యలను ఎస్పీ తుహిన్ సిన్హాకు లిఖితపూర్వకంగా తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని, పోలీస్ గ్రీవెన్స్ డే సందర్భంగా వ్యక్తిగత, వృత్తిపరమైన, శాఖాపరమైన సమస్యలను తెలుసుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కంటైనర్‌లో 500 కిలోల పశుమాంసం పట్టివేత



పోలీసులు పట్టుకున్న పశుమాంసం కంటైనర్

నక్కపల్లి: కంటైనర్‌లో అక్రమంగా తరలిస్తున్న పశుమాంసాన్ని శుక్రవారం నక్కపల్లి పోలీసులు పట్టుకున్నారు. సీఐ కుమార స్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా సంతపాలెం నుంచి రాజమండ్రి వైపు కంటైనర్ వ్యాన్‌లో పశుమాంసం తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే ఎస్ఐ సన్నిబాబు, సిబ్బందితో కలసి వేంపాడు టోల్‌ప్లాజా వద్ద దాడి చేసి కంటైనర్‌ను పట్టుకున్నారు. పట్టుకున్న పశుమాంసం 500 కిలోలు ఉంటుందని, సుమారు రూ.10 లక్షలు విలువ చేస్తుందని సీఐ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఐదుగురిని అదుపులోకి తీసుకుని, వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ పశుమాంసాన్ని తహసీల్దార్ కార్యాలయం వెనుక ఉన్న ఖాళీ స్థలంలో పూడ్చివేశామన్నారు.

సిరులతల్లీ.. కరుణించమ్మా..

- కనకమహాలక్ష్మి ఆలయంలో ఘనంగా లక్ష కుంకుమ పూజలు
- మార్మోగిన అమ్మవారి నామస్మరణ



ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు, లక్ష కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

యలమంచిలి రూరల్: కోరిన వరాలిచ్చే కల్పవల్లిగా భాసిల్లుతున్న యలమంచిలి కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక లక్ష కుంకుమ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభించిన పూజల్లో సుమారు 1000 మందికి పైగా మహిళలు పాల్గొన్నారు. కలశం, అమ్మవారి ఫొటో, గాజులు, జాకెట్టుతో మహిళలంతా భక్తిశ్రద్ధలతో పూజా క్రతువు పూర్తి చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు వెలవలపల్లి కోటేశ్వర కుమారశర్మ భక్తులతో పూజలు చేయించారు. పూజాదికాల తర్వాత పూర్ణాహుతిలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు అమ్మవారి నామస్మరణతో మార్మోగాయి. పూజల్లో పాల్గొన్న భక్తులకు స్థానిక కిరాణా వ్యాపారి సమయమంతుల బుచ్చియ్య జాకెట్లు, పసుపు, కుంకుమ సమకూర్చారు. పూజల అనంతరం భక్తులందరికీ అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. అంతకుముందు ఉదయం వేకువ జామున అమ్మవారికి పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించి, తర్వాత భక్తులను దర్శనానికి అనుమతించారు. శుక్రవారం ఉద్యయం వర్షం కురిసినప్పటికీ పూజకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రత్యేక షామియానాలు, బల్లలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొఠారు సాంబ, పిల్లా రాము, కొఠారు సూర్యప్రకాష్, తాటిపాకల మాణిక్యాలరావు, తాటిపాకల చిన్ని, చాగంటి శివ మణికంఠ, తుంపాల దుర్గా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష పసుపు కొమ్ములతో కనకమహాలక్ష్మికి పూజలు

కశింకోట: కశింకోటలోని కనకమహాలక్ష్మి అమ్మవారు పసుపు కొమ్ముల శ్రేణి నడుమ భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక కనకమహాలక్ష్మి వీధిలో కొలువైన అమ్మవారి ఆలయంలో మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా భక్తులు, ఆలయ కమిటీ సమకూర్చిన లక్ష పసుపు కొమ్ములతో లక్ష్మీ సహస్ర నామాలతో పూజలు చేశారు. అమ్మవారు పసుపు కొమ్ముల శ్రేణి మధ్య భక్తులకు దేదీప్యమానంగా దర్శనమిచ్చి కనువిందు చేశారు. ఆలయ అర్చకులు వి.చిదంబరం, వి.కృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారిని నూతన వస్త్రాలు, ఆభరణాలు, పూలతో అలంకరించి పసుపు కొమ్ముల శ్రేణి నడుమ భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు చీరలు, జాకెట్లు, పసుపు కొమ్ములు, కుంకుమ సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మహిళా భక్తులు విడతల వారీగా లలిత సహస్ర నామ పారాయణం చేశారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ భీశెట్టి కుమార్, వార్డు మాజీ సభ్యురాలు సూరిశెట్టి రేవతి, తదితరులు పాల్గొన్నారు.



కశింకోటలో కనకమహాలక్ష్మి అమ్మవారికి పసుపు కొమ్ములతో పూజిస్తున్న వేద పండితులు



లలిత సహస్ర నామ పారాయణ చేస్తున్న మహిళలు

అవార్డులు పొందిన సర్పంచ్‌లకు సీఎం అభినందనలు

తుమ్మపాల/నక్కపల్లి: భారత రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయ పంచాయతీ అవార్డులు (దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ శతత్ వికాస్ పురస్కార్–2024) పొందిన సర్పంచులు, అధికారులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అభినందించినట్లు జిల్లా పంచాయతీ అధికారి ఆర్.శిరీషారాణి తెలిపారు. గురువారం సాయంత్రం అమరావతి సెక్రటేరియట్‌లోని ముఖ్యమంత్రి కార్యాలయంలో హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత సమక్షంలో అధికారులు, అవార్డులు పొందిన గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు ముఖ్యమంత్రిని కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులు, సర్పంచ్‌లను అభినందిస్తూ గ్రామీణాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను సమర్థవంతంగా అమలు చేసి గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేయాలని తెలిపారు. అవార్డు పొందిన గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం అందజేసే రూ. కోటి రివార్డుతో సదుపాయాలు కల్పించాలని సర్పంచులకు సూచించారని ఆమె తెలిపారు. నక్కపల్లి మండల న్యాయంపూడి పంచాయతీ సర్పంచ్ రెడ్డి వరహాలబాబు, అనకాపల్లి మండలం తగరంపూడి గ్రామ పంచాయతీ సర్పంచ్ యాదగిరి అప్పారావు, అధికారులు పాల్గొన్నారు



అవార్డు పొందిన సర్పంచ్‌లు, అధికారులను అభినందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

గణితంలో మెలకువలు నేర్చుకోవాలి

పాయకరావుపేట: విద్యార్థులు గణితం పట్ల అవగాహన, మెలకువలు నేర్చుకోవాలని చెన్నై మ్యాథమెటికల్ ఇన్‌స్టిట్యూట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మద్దాల సుందరి సూచించారు. స్వెసెస్ డిగ్రీ కళాశాలలో ఇన్ఫినిటం పేరిట శుక్రవారం నిర్వహించిన సెమినార్‌లో ఆమె మాట్లాడారు. గణితం అప్లికేషన్స్‌ను ఆస్ట్రోఫిజిక్స్, ఓరిగామిలో ఎలా ఉపయోగిస్తారో వివరించారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో గణితం పరిధిని వివరించి, విద్యార్థులకు గణితం పట్ల ఉన్న ఆసక్తిని మరింత పెంపొందించారు. అంతర్జాతీయ గణిత విద్య, పరిశోధన సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎస్.ఆర్.సంతానం, నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, మ్యాథమెటిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.శివయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ. 6వేలు, ద్వితీయ బహుమతిగా రూ.3 వేలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రామకృష్ణారెడ్డి, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ పెనుగొండ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు గణితంపై అవగాహన చేస్తున్న అసోసియేట్ ప్రొఫెసర్ మద్దాల సుందరి

లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

ఎస్.రాయవరం: మతిస్థిమితం లేని యువతిపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నర్సీపట్నం డీఎస్పీ జి.ఆర్.ఆర్.మోహన్ తెలిపారు. శుక్రవారం అడ్డురోడ్డు సర్కిల్ కార్యాలయంలో స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడారు. ఎస్.రాయవరం మండలం గుర్రాజుపేట గ్రామంలో మతిస్థిమితం లేని 21 ఏళ్ల యువతిపై అదే గ్రామానికి చెందిన 43 ఏళ్ల వ్యక్తి గురువారం లైంగిక దాడికి పాల్పడినట్లు చెప్పారు. గ్రామంలో ఒంటరిగా నడిచి వెళ్తున్న యువతికి మాయమాటలు చెప్పి, ఓ పాడుబడ్డ ఇంటికి తీసుకెళ్లి ఈ దారుణానికి పాల్పడ్డాడని డీఎస్పీ తెలిపారు. సంఘటన స్థలం వద్ద అలికిడి రావడంతో సమీప గ్రామస్తులు వెళ్లి చూసే సరికి నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడన్నారు.

వెంటనే సమాచారం అందుకున్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఎస్ఐ విభీషణరావు నిందితుడి పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. బాధితురాలిని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి వైద్య పరీక్ష చేయించారు. నిందితుడిని గుర్రాజుపేట జంక్షన్ వద్ద బస్సు ఎక్కి పారిపోతుండగా శుక్రవారం పట్టుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ మోహన్

విమానయానం.. ప్రగతి విహారం



విశాఖ నుంచి ప్రతి నెలా పెరుగుతున్న సర్వీసులు

విశాఖ సిటీ : శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖ నుంచి విమానాల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. రాష్ట్రంలో ఆర్థిక రాజధానిగా ఎదుగుతున్న విశాఖ నుంచి విమానయానానికి ప్రాధాన్యం పెరుగుతోంది. దేశీయంగానే కాకుండా విదేశీ ప్రయాణికుల సంఖ్య కూడా నానాటికి రెట్టింపు అవుతోంది. ఉత్తరాంధ్ర వాసులే కాకుండా ఒడిశా నుంచి ప్రయాణికులు పెద్ద సంఖ్యలో విశాఖ విమానాశ్రయం నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ప్రతి ఏడాది ప్రయాణికుల సంఖ్య పెరుగుతూ పోతోంది. ఇందుకు తగ్గట్టుగానే ఎయిర్‌పోర్టులో సౌకర్యాలతో పాటు దేశయ, విదేశీ విమాన సర్వీసులు పెరుగుతుండడంతో గత ఏడాది కాలంలో మరింత అద్భుతమైన అభివృద్ధి, పురోగతి సాధించింది.

ప్రతి రోజు 9 వేల మంది రాకపోకలు

కోవిడ్ కారణంగా తగ్గిన విమాన సర్వీసులు, ప్రయాణికుల రాకపోకల్లో వృద్ధి నమోదవుతోంది. 2023 నవంబర్‌లో 2,06,213 మంది దేశీయ ప్రయాణికులు రాకపోకలు సాగించగా.. ఈ ఏడాది అదే నెలలో ఆ సంఖ్య 16.62 శాతం వృద్ధితో 2,40,494కు చేరుకుంది. అలాగే దేశీయ విమాన సర్వీసులు 2023 కంటే ఇప్పుడు 17.94 శాతం వృద్ధిని నమోదు చేశాయి. ప్రయాణికుల సంఖ్య కూడా విస్తృతంగా పెరగడంతో అందుకు తగ్గట్టుగానే విమాన సర్వీసులు పెరిగాయి. ఒకవైపు దేశీయంగానే కాకుండా విదేశీ విమాన సర్వీసులు కూడా క్రమేపీ పెరుగుతున్నాయి. ప్రస్తుతం విశాఖ విమానాశ్రయం నుంచి రోజుకు 9 వేల మంది దేశ, విదేశీ ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు.

పెరిగిన విమాన సర్వీసులు

విశాఖ ఎయిర్‌పోర్ట్‌కు ప్రాధాన్యత పెరుగుతుండడంతో కొత్త విమాన సర్వీసులు అందుబాటులోకి వచ్చాయి. కోవిడ్‌కు ముందు రోజుకు 23 నుంచి 25 సర్వీసులు ఉండగా ప్రస్తుతం 30 నుంచి 35 సర్వీసులు నడుస్తున్నాయి. ఇందులో ప్రధానంగా ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ, తిరుపతి, కర్నూల్, జైపూర్, పోర్ట్ బ్లెయిర్‌లకు ఇండిగో, ఎయిర్ ఇండియా సర్వీసులు ఉన్నాయి. అలాగే విదేశీ ప్రయాణికుల సంఖ్య కూడా పెరుగుతుండడంతో ఇండియా వన్ ఎయిర్, స్కూట్, థాయ్ ఎయిర్ ఏషియా, ఎయిర్ ఏషియా బెర్హాద్ ఎయిర్‌లైన్స్ సింగపూర్, బ్యాంక్, కౌలాలంపూర్‌లకు సర్వీసులు నడుపుతున్నాయి. ఈ ఏడాది అక్టోబర్ వరకు విశాఖ నుంచి విజయవాడకు ఒక విమానం మాత్రమే ఉండేది. ఇప్పుడు ఆ సంఖ్య మూడుకు చేరుకుంది. అలాగే ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరి నుంచి విశాఖకు విమానాన్ని ప్రారంభించేందుకు ఇండియా వన్ ఎయిర్ సిద్ధంగా ఉంది. ఇందుకు ఒడిశా ప్రభుత్వం కూడా ఆమోదించింది. డొమెస్టిక్, ఇంటర్నేషనల్ ఇలా అన్ని సర్వీసుల ఆక్యుపెన్సీ కూడా 80 నుంచి 95 శాతం నమోదవుతుండడం విశేషం.

సంవత్సరం	దేశీయ ప్రయాణికులు	ఇంటర్నేషనల్ ప్రయాణికులు
2018-19	27,03,261	1,50,370
2019-20	25,47,992	1,43,580
2020-21	11,06,451	8,192
2021-22	16,28,317	2981
2022-23	24,35,618	65,171
2023-24	27,22,722	66,192
2024-25 (నవంబర్)	18,22,202	81,760

కొత్తగా రెండు అంతర్జాతీయ సర్వీసులు

ఈ ఏడాది కొత్తగా రెండు అంతర్జాతీయ సర్వీసులు ప్రారంభమయ్యాయి. విశాఖ నుంచి బ్యాంకాక్‌కు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి విమానాలు రాకపోకలు సాగిస్తున్నాయి. విశాఖ నుంచి కౌలాలంపూర్‌కు ఏప్రిల్ 26వ తేదీ నుంచి వారానికి 3 విమానాలు నడుస్తున్నాయి. భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ విమాన సర్వీసులను ప్రారంభించేందుకు విమానయాన సంస్థలతో చర్చలు జరుపుతున్నారు. విదేశీ విమాన ప్రయాణికులు రికార్డు స్థాయిలో పెరిగారు. 2023 నవంబర్‌లో 5,165 మంది రాకపోకలు సాగించగా.. ఈ ఏడాది నవంబర్‌లో 83.45 శాతం అధికంగా 9,475 మంది ప్రయాణించారు. అంతర్జాతీయ విమాన సర్వీసులు కూడా గతేడాది 35 ఉండగా తాజాగా 77కు పెరిగి 120 శాతం వృద్ధిని సాధించాయి.

కేజీహెచ్ అడ్మినిస్ట్రేటర్‌గా రమణ నియామకం

మహారాణిపేట: కేజీహెచ్ అడ్మినిస్ట్రేటర్‌గా డిప్యూటీ కలెక్టర్ బి.వి.రమణ నియమితులయ్యారు. ప్రభుత్వ ఆస్పత్రిలో కొత్తగా అడ్మినిస్ట్రేటర్ పోస్టును సృష్టించి.. డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారిని నియమించింది. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి. కృష్ణబాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ కలెక్టర్ బి.వి.రమణ త్వరలో ఈ బాధ్యతలు స్వీకరించనున్నారు.

హడావుడి పదోన్నతులు

- అర్ధరాత్రి జాబితాలు.. వాట్సాప్ సందేశాలు
- నేడు డీఈవో కార్యాలయంలో కౌన్సిలింగ్

విశాఖ విద్య: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యాశాఖలో పదోన్నతుల ప్రక్రియ గందరగోళానికి దారితీస్తోంది. రాత్రి వేళ సీనియార్టీ జాబితాలను ప్రకటించి, తెల్లవారి ప్రమోషన్ల కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని వాట్సాప్‌లో సమాచారం పంపిస్తున్నారు. విశాఖ, అనకాపల్లి జిల్లాలోని మున్సిపల్ స్కూళ్లలో పనిచేస్తున్న 12 మంది ఉపాధ్యాయులకు ఇటీవల పదోన్నతులు కల్పించారు. 70:30 నిష్పత్తి పాటించకపోవడంపై వ్యతిరేకత వెల్లువెత్తడంతో మళ్లీ ఖాళీల గుర్తింపు చేపట్టారు. తాజాగా స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో 34 ఖాళీలను ప్రకటించారు. ఎస్ఏ తెలుగు–13, హిందీ–3, గణితం–3, ఇంగ్లిష్–4 ఫిజిక్స్–1, బయాలజీ–6, సోషల్–4 ఉన్నట్లు లెక్క తేల్చారు. శనివారం ఉదయం 10.30కు డీఈవో కార్యాలయంలో జరిగే కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని డీఈవో ప్రేమ్‌కుమార్ శుక్రవారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. సీనియార్టీ జాబితాలపై అభ్యంతరాలకు గడువీయకుండానే కౌన్సిలింగ్‌కు పిలవడమేంటని ఉపాధ్యాయులు ఆక్షేపిస్తున్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని ఒకరి దుర్మరణం



మళ్ల దేవకీ కనక సత్యనారాయణ (ఫైల్)

అనకాపల్లి/మునగపాక: పూడిమడక జాతీయ రహదారి నాగులాపల్లి జంక్షన్ జేఎల్ హైస్కూల్ వద్ద ఆగి ఉన్న లారీని అదే గ్రామానికి చెందిన మళ్ల దేవకీ కనక సత్యనారాయణ(45) ద్విచక్ర వాహనంతో ఢీకొనడంతో శుక్రవారం అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాఫిక్ ఎస్ఐ రషీద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగులాపల్లి గ్రామానికి చెందిన మళ్ల దేవకీ కనక సత్యనారాయణ లారస్ కంపెనీలో హెల్పర్‌గా పని చేస్తున్నాడు. ఈయన భార్య లక్ష్మి ఇంటి వద్ద కూరగాయల వ్యాపారం చేస్తోంది. రోజూ మాదిరిగా సత్యనారాయణ ద్విచక్ర వాహనంపై అనకాపల్లి కూరగాయలు మార్కెట్‌కు వచ్చి కూరగాయలు తీసుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో జంక్షన్ వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొని మృతి చెందాడు. మృతుడు భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నాగులాపల్లిలో విషాదఛాయలు

సత్యనారాయణ మృతితో నాగులాపల్లి గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఆయన మృతిని కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. పెద్ద దిక్కును కోల్పోవడంతో భార్య, కుమార్తెల రోదనలు మిన్నంటాయి. అందరితో సరదాగా ఉండే సత్యనారాయణ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో నాగులాపల్లి వాసులు కన్నీటి పర్యంతమయ్యారు.

ఎన్టీపీసీకి ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీకి 2024కు గాను ప్రతిష్టాత్మక ఎనర్జీ కన్జర్వేషన్ రజత పురస్కారం లభించింది. థర్మల్ పవర్ ప్రాజెక్టులో శక్తి సంరక్షణ, శక్తి సామర్థ్యం కేటగిరీలో ఈ అవార్డును ఏపీ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ అందించింది. సంస్థ తరఫున ఏజీఎం(ఈఈఎంజీ) నవీన్ కిశోర్, ప్రభుత్వ ఇంధనశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్‌లు శుక్రవారం నగరంలోని ఓ హోటల్లో జరిగిన కార్యక్రమంలోఅందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పురస్కారం స్థిరత్వం పట్ల సంస్థకు ఉన్న తిరుగులేని నిబద్ధతను చాటిచెప్తుందన్నారు.



అవార్డును అందుకుంటున్న ఏజీఎం నవీన్‌కిశోర్, ఇంధన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ విజయానంద్

సీతయ్యపేట దుర్గామల్లేశ్వర్ల ఆలయంలో చోరీ

- 7 తులాల బంగారు ఆభరణాలు అపహరణ
- డాగ్, క్లూస్ టీం సభ్యులతో పోలీసుల విచారణ

బుచ్చెయ్యపేట: మండలంలోని సీతయ్యపేట దుర్గామల్లేశ్వర్ల అమ్మవారి బంగారు నగలను దొంగలు ఎత్తుకుపోయారు. గురువారం రాత్రి ఆలయంలో పూజలు, భజనలు చేసి తాళాలు వేయగా.. శుక్రవారం ఉదయం చూసే సరికి ఆలయ తలుపులు పగలగొట్టి ఉన్నాయి. అమ్మవారికి అలంకరించి ఉన్న నగలన్నీ మాయం చేశారు. మంగళ సూత్రాలు, చెవి దిద్దులు, ముక్కుపుడక తదితర వస్తువులన్నింటిని నిలువు దోపిడీ చేశారు. అమ్మవారికి చెందిన సుమారు ఏడు తులాల బంగారు వస్తువులు మాయమైనట్లు ఆలయ సిబ్బంది గుర్తించారు. దీనిపై ఆలయ ధర్మకర్త రాము భవాని ఫిర్యాదు మేరకు బుచ్చెయ్యపేట ఎస్ఐ శ్రీనివాసరావు దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి ఆలయంలో దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. వేలి ముద్రలు సేకరించి స్థానికులను విచారించారు. దగ్గరలో ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. ఇటీవల కాలంలో కేపీ అగ్రహారం, అయితంపూడి గ్రామాల్లోని ఆలయాల్లో హుండీల చోరీ, శింగవరంలో ఆటో, వడ్డాదిలో బైక్‌లు, ఇలా పలు గ్రామాల్లో నిత్యం దొంగతనాల జరగడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రధాన జంక్షన్లతో పాటు ముఖ్య గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి దొంగతనాలను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ఆలయంలో విచారణ చేస్తున్న పోలీసులు

తెలుగు వెలుగు చిన్నయసూరి

- సాహితీవేత్త పేరి రవికుమార్‌కు 'చిన్నయ్య సూరి'పురస్కారం ప్రదానం



పేరి రవికుమార్‌కు చిన్నయ్య సూరి పురస్కారం అందజేస్తున్న మంత్రి దుర్గేష్

సీతంపేట: తెలుగుతనానికి నిలువెత్తు నిదర్శనం పరవస్తు చిన్నయసూరి అని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పరవస్తు పద్య పీఠం ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం ఆయన జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా పరవస్తు చిత్రపటానికి మంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. సాహితీవేత్త డాక్టర్ పేరి రవికుమార్‌కు 'చిన్నయసూరి' పురస్కారం ప్రదానం చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఉపాధి కోసం ఆంగ్లం నేర్చుకున్నా.. తల్లి భాష మాతృభాషను మరువకూడదన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆచార్య బేతవోలు రామబ్రహ్మం మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల్లో కొన్ని గ్రంథాలు, పాఠాలు చెప్పే అధ్యాపకులు లేక ఆయా శాఖలను మూసివేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. పురస్కార గ్రహీత రవికుమార్ మాట్లాడుతూ తెలుగు భాషకు వ్యాకరణం అందించిన పరవస్తు చిన్నయసూరి పేరిట పురస్కారం అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. పీఠం వ్యవస్థాపకుడు ఫణిశయన సూరి మాట్లాడుతూ తెలుగు సాహిత్యానికి మరల పూర్వ వైభవం వస్తుందన్నారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: విజయవాడ–కాజీపేట సెక్షన్ పరిధిలో ఆధునిక పనుల నేపథ్యంలో ఈ మార్గంలో నడిచే పలు రైళ్లు ఆయా తేదీల్లో దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. కింది రైళ్లు ఆయా తేదీల్లో వయా గుంటూరు–పగిడిపల్లి మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

- ఈనెల 26 నుంచి జనవరి 8వ తేదీ వరకు విశాఖపట్నం–లోకమాన్యతిలక్ టెర్మినస్ (18519) ఎక్స్‌ప్రెస్, జనవరి 6 నుంచి 8వ తేదీ వరకు సీఎస్‌టీ ముంబయి–భువనేశ్వర్(11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్, జనవరి 6 నుంచి 8వ తేదీ వరకు భువనేశ్వర్–సీఎస్‌టీ ముంబయి(11020) కోణార్క్ ఎక్స్‌ప్రెస్, జనవరి 6 నుంచి 8వ తేదీ వరకు షాలిమర్–హైదరాబాద్ (18045) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, జనవరి 7 నుంచి 9వ తేదీ వరకు హైదరాబాద్–షాలిమర్ (18046) ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్, జనవరి 1, 8వ తేదీల్లో షాలిమర్–సికింద్రాబాద్ (22849) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, జనవరి 7న సికింద్రాబాద్–షాలిమర్ (12774) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, జనవరి 8, 9వ తేదీల్లో విశాఖపట్నం–సికింద్రాబాద్ (20833) వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లు మళ్లించబడిన మార్గంలో నడుస్తాయి.

క్లుప్తంగా

నేడు మాజీ సీఎం జగన్ పుట్టిన రోజు వేడుకలు

కశింకోట: కశింకోటలో శనివారం ఉదయం 9 గంటలకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, ఆర్‌ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు తెలిపారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పాలు, రొట్టెలు, దుప్పట్లు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. పార్టీ నాయకులు, శ్రేణులు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

గౌరీపరమేశ్వరుల ఉత్సవం 28కి మార్పు

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డులోని కుంచావారి గౌరీపరమేశ్వరుల అమ్మవారి ఉత్సవం ఈనెల 28న నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఎం.వీరభద్రరావు (అబ్బులు) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నిర్వహించాల్సిన అమ్మవారి ఉత్సవాన్ని తుపాను కారణంగా 28వ తేదీకి మార్చినట్లు తెలిపారు. అమ్మవారి ఉత్సవాన్ని తిలకించే భక్తులు 28వ తేదీన రావాలని ఆయన కోరారు.

పోలీస్ కుటుంబాలకు చెక్కుల అందజేత



శ్యామ్‌సుందరరావు భార్యకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: పోలీస్ శాఖలో విధులు నిర్వర్తించి పదవీ విరమణ చేసిన ఎస్‌ఐ వి.సోమలింగంకు రూ. లక్ష 72 వేల 600, పాడేరులో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తు గుండె పోటుతో మరణించిన కె.శ్యామ్‌సుందరరావు కుటుంబానికి రూ. లక్ష 90 వేల 200 చెక్కును శుక్రవారం ఎస్పీ తుహిన్ సిన్హా తన కార్యాలయంలో అందజేశారు.

అక్రమ మద్యం స్వాధీనం

కశింకోట: మండలంలోని సుందరయ్యపేట శివారు ఆనందపురంలో అక్రమంగా తరలిస్తున్న 30 క్వార్టర్ సీసాల మద్యాన్ని శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ సూర్యారావు తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకుసిబ్బందితో వెళ్లి వీటిని పట్టుకున్నామన్నారు. ఈ సందర్భంగా బండారు అప్పలనాయుడును పట్టుకుని కేసు నమోదు చేశామన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 1,113 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,900	5,170
మొదటి రకం	3,580	4,150
రెండో రకం	3,250	3,830
మూడోరకం	3,080	3,240

అనకాపల్లి సినిమాలు

పుష్ప-2	: సత్యనారాయణ స్క్రీన్-1
ముఫాసా	: సత్యనారాయణ స్క్రీన్-2
ముఫాసా	: పర్తిసాయి
బచ్చల మల్లి	: షిర్డీసాయి
జీబ్రా	: వెంకటేశ్వర
అమరన్	: శ్రీసత్య
పుష్ప-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 24 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-7 యూనిట్లు, బీ పాజిటివ్-4 యూనిట్లు, ఓ పాజిటివ్-12 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్‌ను (9703619706) సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 248 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 153 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబరులో సంప్రదించవచ్చు.

ఆశలు ఆవిరి

ఈ ఖరీఫ్ సీజన్ మొదటి నుంచి రైతులు అనేక ప్రయాసలు పడుతూ పంటలను కాపాడుకొస్తున్నారు. కోత కోసి కుప్ప పెట్టి సంక్రాంతి నాటికి ఇంటికి తీసుకెళదామన్న ఆనందంలో ఉన్న రైతు ఆశను రెమాల్ తుపాను అడియాసలు చేసింది. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వ్యవ ప్రయాసలకోర్చి సాగు చేసిన పంట కోతలు కోసి కుప్పలకు సిద్ధమయ్యారు. కాని రెమాల్ తుపాను విస్తరించి ఏకంగా నిమిషం కూడా తెరపి ఇవ్వకుండా కురుస్తుండడంతో వరి పనలు మద్దయి నేల పాలయ్యాయి. శుక్రవారం నాటికి పనల్లో వర్షపు నీరు చేరి గింజలు నీటి పాలవుతున్నాయి. ఇంకా వర్షం కొనసాగితే గింజ మొలకెత్తి తీవ్ర నష్టం చవిచూడాల్సి వస్తుందని రైతులు లబోదిబోమంటున్నారు.



వర్షంలో తడుస్తున్న వరి పనలు

- వర్షాలతో రెండు రోజులుగా తడుస్తున్న వరి పనలు
- పంటను కాపాడుకునేందుకు వర్షంలోనే పనలను ఒడ్డుకు చేర్చుతున్న రైతులు
- గింజ మొలకెత్తితే చేతికందిన పంట చేజారినట్లే

నియోజకవర్గంలో మొత్తం వరి సాగు, పూర్తయిన కోతలు, పనలపై ఉన్న వరి వివరాలు (ఎకరాల్లో)

మండలం	మొత్తం వరి	పూర్తయిన కోతలు	పనలపై ఉన్న వరి	పూర్తయిన కుప్పలు
అనకాపల్లి	6,200	3,729	350	1,366
కశింకోట	3,360	336	80	256
మొత్తం	9,560	4,085	430	1,622

తుమ్మపాల: నియోజకవర్గంలో అనకాపల్లి, కశింకోట మండలాల్లో అధిక శాతం రైతులు సాగు చేసిన వరి పంట కోతలు మధ్యలోనే నిలిచిపోయాయి. కొన్ని చోట్ల కోతలు కోసి ముందుగానే కుప్పలు పూర్తి చేశారు. మరి కొన్ని చోట్ల కోతలు కోసి నేల పైనే పనలు ఉంచడంతో ఈ వర్షానికి రైతులు దొరికిపోయారు. నేలపై ఉంచిన పనలను రెమాల్ తుపాను రెండు రోజులుగా తీయకుండా అడ్డుకుంది. గురువారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో పనల్లో నీరు చేరింది. దీంతో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం వర్షాన్ని సైతం లెక్క చేయకుండా వరి పనలను నీటిలోంచి గట్టుకు తరలించారు. నీటిలో మునిగిన పనలను అలాగే వదిలేస్తే గింజ మొలకెత్తే అవకాశం ఉందని, అలాగని గట్టుకు చేర్చితే తడవడంతో గింజ రాలిపోతుందని ఆవేదన చెందుతున్నారు.

రైతులకు సమాచారలోపం..

రైతులకు అన్ని వేళల ప్రభుత్వం తరఫున సమాచారం అందించాలని, అందుకుగాను గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాల్లో గత ప్రభుత్వం వ్యవసాయ శాఖ శాశ్వత సిబ్బందిని నియమించింది. వారి ద్వారా వ్యవసాయంలో ఆధునిక పద్ధతుల నుంచి ఎరువులు, వాతవరణ సమాచారం అందించి రైతులను అప్రమత్తం చేసేవారు. కాని కూటమి ప్రభుత్వంలో క్షేత్రస్థాయిలో రైతులకు సమాచారం అందించే నాథులే లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెమాల్ తుపాను ప్రభావంపై పూర్తి అవగాహన లేకనే అన్ని గ్రామాల్లో ఈ నెల 17,18 తేదీల్లో వరి కోతలు కోసి తుపాను ప్రభావానికి గురయ్యామని రైతులు చెబుతున్నారు.



నీట మునిగిన వరి పనలను గట్టుకు చేర్చుతున్న రైతు

గింజ మొలకెత్తకుండా ఉప్పు ద్రావణం చల్లాలి..

నియోజకవర్గంలో సగానికి పైగా కోతలు పూర్తయి అధిక సంఖ్యలో రైతులు కుప్పలు పూర్తి చేశారు. కొంత మంది రైతులు కోతలు చేపట్టడంతో తుపాను ప్రభావం పనలపై పడింది. వర్షం ఆగకుండా పడటంతో కుప్పలు పెట్టే అవకాశం లేదు. వర్షంతో పనల్లో నీరు చేరే అవకాశం ఉన్నందున రైతులు ముందుగానే మేల్కొని నీరు నిల్వ లేకుండా గట్లు తీసివేయాలి. నీటిలో ఉప్పు కలిపి పనల్లో గింజలపై చల్లితే మంచి ఫలితం ఉంటుంది.

– ఏడీ రామారావు, వ్యవసాయ శాఖ అధికారి, అనకాపల్లి డివిజన్

వరి పనల్లో వర్షపు నీరే ఉంది..



ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ రకరకాల ఇబ్బందులు కలిగిస్తోంది. చివరకు వరి పంట బాగా పండింది. కోత కోసి కుప్పలు పెడదామన్న లోపే తుపాను రూపంలో వర్షం దాపురించింది. కౌలు చేస్తున్న రెండెకరాల వరి మొత్తం కోత కోయడంతో నేలపైనే పనలుగా ఉంది. గురువారం నుంచి కురుస్తున్న వర్షంతో పనలపై నీరు చేరి గింజ తడిసిపోయింది. పనలను గట్టుకు చేర్చితే కనీసం గింజ కట్టకుండ ఉంటుందని ఆశతో ఉదయం నుంచి వర్షంలోనే పనలను గట్టుపై పెడుతున్నాం.

– గోపిశెట్టి చిన్నారావు, రైతు, రేబాక గ్రామం.

చేతికందిన పంట చేజారిపోతోంది..



కౌలు చేస్తున్న ఎకరం పొలం బాగా పండింది. ఏడాదికి సరిపడా ధాన్యంతో పాటు పశువులకు గడ్డి సరిపోతుందని ఆనందపడ్డాను. వరి కోత యంత్రాన్ని తీసుకుని ఒక్కడినే మొత్తం కోత పూర్తి చేశాను. రెండు రోజులు ఆరితే కుప్ప పెడదామన్నకున్న లోపే వర్షం రాత్రింబవళ్లు కురుస్తోంది. ఇప్పటికే పనల్లో నీరు చేరింది. నీరు పోయే అవకాశం లేదు. పనలను ముట్టుకుంటే గింజ రాలిపోతుంది. ముందస్తు అవగాహన లేకనే కోత చేపట్టాను.

– బద్ది వెంకటేష్, రైతు, రేబాక గ్రామం.

సందడి చేసిన పూర్వ విద్యార్థులు

అనకాపల్లి: మండలంలో ఏఎంఏఏ హైస్కూల్ 1974–75 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక హైస్కూల్ ఆవరణలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి బుద్ద కాశీవిశ్వేశ్వరరావు (కాశీ మాస్టార్) మాట్లాడుతూ 50 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా అందరం కలుసుకుని తీపి జ్ఞాపకాలు నేమరు వేసుకున్నట్లు తెలిపారు. అనంతరం వచ్చే ఏడాది పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు పూర్వ విద్యార్థులు రూ.42 వేలు విలువ చేసే స్టడీ మేటీరియల్, ఆల్ ఇన్ వన్ పుస్తకాలను ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఆర్‌పీపీ ప్రసాద్, కొలపర్తి కన్నబాబు, ఆడారి రమణమ్మ, కొణతాల రత్నాజీ, వంకాయల రాజేశ్వరి, బుద్ద సత్యనారాయణ, సీవీ రామకృష్ణ, ఎస్.లక్ష్మీనారాయణ, గ్రంథి సురేష్, హైస్కూల్ హెచ్‌ఎం కె.లావణ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాశీవిశ్వేశ్వరరావు

కోతలు వాయిదా వేసుకోవాలి

అనకాపల్లి: వర్ష సూచన ఉన్నందున, కోతలను వాయిదా వేసుకోవాలని, ఇప్పటికే పైరు కోసి ఉంటే, కుప్పలుగా పెట్టుకుని టార్పాలిన్ పరదా కప్పాలి లేదా నీడగా ఉన్న సురక్షిత స్థలంలో ఉంచి ఆరబెట్టాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం వ్యవసాయ విస్తరణ ప్రధాన శాస్త్రవేత్త రమణమూర్తి, వాతావరణ విభాగం ప్రధాన శాస్త్రవేత్త వి.గౌరీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వర్షాల అనంతరం 12–14 రోజుల వయసు గల వరిలో 2.5 కిలోల యూరియా వేసుకోవాలని, నారును పీకే వారం రోజుల ముందు కార్బోఫ్యూరాన్ గుళికలను 5 సెంట్ల నారుమడికి 800 గ్రాముల చొప్పున వేసుకోవాలని తెలిపారు. తేమను ఉపయోగించుకుని రాగి పైరు విత్తుకోవచ్చన్నారు. పొలంలో చేరిన అధిక నీటికి తీసివేయాలని, అపరాలు విత్తుకోవడం వాయిదా వేసుకోవాలని తెలిపారు. వాతావరణ పరిస్థితులకు అపరాలలో బూడిద, ఆకు మచ్చ తెగుళ్ల ఆశించే అవకాశం ఉందని, వర్షాల అనంతరం ముందు జాగ్రత్త చర్యగా ప్రొపికొనజోల్ 1 మిల్లీలీటర్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. తేమను ఉపయోగించుకుని రాగి పైరు విత్తుకోవచ్చని, 15–20 రోజులు వయసు గల పైరులో తెగుళ్లు రాకుండా ముందస్తు చర్యగా ప్రొపికొనజోల్ 1 మిల్లీలీటరు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. మొక్కజొన్న విత్తుకోవడం వాయిదా వేసుకోవాలని, వర్షాల అనంతరం తేమను ఉపయోగించుకోవచ్చన్నారు.

15 లీటర్ల నాటుసారాతో వ్యక్తి అరెస్టు

అనకాపల్లి: జీవీఎంసీ విలీన గ్రామమైన వల్లూరులో నాటుసారా తయారు చేస్తున్న ఎర్ర నాగరాజుపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎక్సైజ్ సీఐ వై.లక్ష్మణనాయుడు శుక్రవారం చెప్పారు. అజ్ఞాత వ్యక్తులు ఇచ్చిన సమాచారం మేరకు వల్లూరు గ్రామంలో దాడులు నిర్వహించగా నాగరాజు 15 లీటర్ల నాటుసారా తయారు చేసేందుకు ఉపయోగించిన వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు.



నాటుసారా తయారు చేసిన నాగరాజుతో ఎక్సైజ్ సీఐ లక్ష్మణనాయుడు, సిబ్బంది

పశువుల వ్యాధుల నియంత్రణకు చర్యలు

తుమ్మపాల: కాలానుగుణంగా పశువులకు వచ్చే వ్యాధుల నియంత్రణకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో వ్యాధి నిరోధక టీకాలు వేసేందుకు చర్యలు చేపట్టినట్లు జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి.రామమోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల నుంచి మార్చి- 2025 వరకు చేపట్టవలసిన వైద్యసేవలు, టీకాల కార్యక్రమం, ఇతర సేవలపై అన్ని మండలాల అధికారులు, సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. రూ.2 కోట్ల విలువ గల మందులను ఈ నెలలో అన్ని మండలాల పశువైద్య కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు. ఈ నెలలో గొంతువాపు వ్యాధి నివారణ టీకాలు, జనవరి–2025లో ఉచిత నట్టల నివారణ, గొర్రెలు, మేకల మశూచి టీకాలు, ఫిబ్రవరిలో కొక్కొర తెగులు, కోళ్ల మశూచి వ్యాధి నివారణ టీకాలు, బ్రూసెల్లా టీకాలు, మార్చిలో గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు పంపిణీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పనిచేసే ప్రాంతంలో సదుపాయాలు ఎక్కడ?

- అధికారులపై సీపీఎం నాయకుల ఆగ్రహం
- రసాభాసగా మునగపాక సామాజిక తనిఖీ ప్రజావేదిక



ఉపాధి హామీ పథకంలో సదుపాయాల కల్పనలో విఫలంపై అధికారులను నిలదీస్తున్న సీపీఎం నేతలు

మునగపాక: జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో పనిచేసే ప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం నాయకులు గనిశెట్టి సత్యనారాయణ, ఆళ్ల మహేశ్వరరావు, వీవీ శ్రీనివాసరావు, బ్రహ్మాజీ డిమాండ్ చేశారు. మునగపాక మండల పరిషత్ హాలులో శుక్రవారం జరిగిన ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజా వేదిక రసాభాసగా సాగింది. ఉపాధి హామీ పథకంలో పారదర్శకత పాటించకపోవడం, పని చేసే ప్రాంతంలో బోర్డులు ఏర్పాటు చేయడం, పే స్లిప్‌లు అందించకపోవడం, తదితర అంశాల్లో అధికారుల నిర్లక్ష్యం సరికాదంటూ సీపీఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత సామాజిక తనిఖీ ప్రజావేదికలో గుర్తించిన తప్పులకు బాధ్యులైన వారిపై ఎటువంటి చర్యలు తీసుకున్నారనే వివరాలు సభ ముందు ఉంచాలని నిలదీశారు. పని దినాలను 200 రోజులకు పెంచడంతో పాటు కనీస వేతనం రూ.600 అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రామాల వారీగా అధికారులు నివేదిక చదివి వినిపించారు. దీనిలో భాగంగా రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో అభివృద్ధికి అవకాశం ఉంటుందన్నారు. పనుల్లో అవినీతి, అక్రమాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, అదనపు పీడీ రోజా రమణి, విజిలెన్స్ అధికారి నిర్మలాదేవి, ఎంపీడీవో ఎం.ఉషారాణి, ఇన్‌చార్జి ఏపీవో ఎరకయ్య, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణ సాహితీసేవ నిరుపమానం

అనకాపల్లి: కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పురస్కారానికి ఎంపికైన పెనుగొండ లక్ష్మీనారాయణ కృషి మరువలేనిదని అనకాపల్లి అరసం ప్రచార కార్యదర్శి బల్లా నాగభూషణం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్మీనారాయణ 50 సంవత్సరాలుగా సాహితీ సేవలను కొనసాగిస్తూ, 2012లో రాసి ప్రచురించిన అభ్యుదయ సాహితీ వ్యాసాల సంపుటి 'దీపిక'కు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావడం అభినందనీయమన్నారు.

కూర్మావతారంలో వేంకటేశ్వరస్వామి



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

కశింకోట: స్థానిక గవరపేటలో వెలసిన రుక్మిణి, సత్యభామ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి శుక్రవారం కూర్మావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ధనుర్మాసోత్సవాలలో భాగంగా విష్ణుమూర్తి దశావతారాల్లో రెండో అవతారంగా కూర్మావతారంలో స్వామిని అలంకరించి వేద మంత్రాలతో పూజించారు. భక్తులు దర్శించుకున్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త భీశెట్టి దుర్గా నాగేశ్వరరావు, అర్చకుడు సుబ్రహ్మణం ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

క్వారీ లారీలతో సమస్యలు

అనకాపల్లి: నిత్యం పట్టణం మీదుగా క్వారీ లారీలు భారీ లోడుతో తిరగడం, లారీల్లో లోడ్ చేసిన పిక్క, రాళ్ల రహదారిపై పడడంతో అటుగా వెళ్లే వాహన చోదకులు, పాదచారులు ప్రమాదాలకు గురి కావలసి వస్తోందని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరనాథ్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధిక లోడుతో వెళ్తున్న లారీలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

పురస్కారాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

అనకాపల్లి: వ్యవసాయ శాస్త్రవేత్త స్వర్గీయ డాక్టర్ కొణతాల రామలింగేశ్వరరావు పురస్కారాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కొణతాల రామలింగేశ్వరస్వామి మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు కొణతాల లక్ష్మీపార్వతి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వామి ఆశయ సాధనకు సేవా దృక్పథం గల వారిని తమ ట్రస్ట్ ద్వారా 2025 భోగి రోజున సత్కరిస్తామన్నారు. ఈ అవార్డులను ఉత్తమ సమాజ సేవకులు, ఉత్తమ ఉపాధ్యాయులకు మొత్తం ఆరుగురికి ఇస్తామన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఔత్సాహికులు దరఖాస్తులను డాక్టర్ కొణతాల రామలింగేశ్వరస్వామి మెమోరియల్ ట్రస్ట్, డోర్ నంబర్ 12–118, చిన్నబాబు కాలనీ, తుమ్మపాల పంచాయతీ–531032, అనకాపల్లి మండలం, అనకాపల్లి జిల్లా చిరునామాకు పంపించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9246642308 నంబరులో సంప్రదించాలన్నారు.

వీడని వర్షంతో వరి రైతులు కుదేలు



నూతలగుంటపాలెంలో నీట మునిగిన వరి పనలు

కశింకోట: అల్ప పీడన ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల బెడద ఇంకా వీడలేదు. శుక్రవారం వర్షం ఎక్కువై నిరంతరాయంగా కురుస్తోంది. దీంతో వరి రైతుల చివరి ఆశలు నీరు గారుతున్నాయి. మరో రెండు రోజుల వరకు వర్షాలకు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు నిట్టూరుస్తున్నారు. మండలంలో ఈ ఏడాది 1360 హెక్టార్లలో వరి పంట వేశారు. దానిలో ఇప్పటికి దాదాపు పది శాతం మేర కోతలు కోశారు. మిగిలిన పంట పండి చేతికి రావలసి ఉంది. ఈ నేపథ్యంలో అల్ప పీడన ప్రభావంతో గత మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నెల 18 నుంచి 19వ తేదీ ఉదయం 8.30 గంటల వరకు 14.6 మిల్లీమీటర్లు, అప్పటి నుంచి శుక్రవారం ఉదయం వరకు 15.4 మిల్లీమీటర్లు, అప్పటి నుంచి రాత్రి 7 గంటల వరకు 12.4 మిల్లీ మీటర్ల వంతున కశింకోటలో వర్షపాతం నమోదైంది. గురువారం వరకు వర్ష పాతం స్వల్పంగా ఉండటంలో ఇలా అయితే పెద్దగా నష్టం ఉండబోదని, గట్టెక్కుతామని రైతులు భావించారు. అయితే శుక్రవారం వర్షపాతం పెరగడమే కాకుండా నిరాటంకంగా ఇంకా వర్షం కురుస్తూనే ఉంది. మండలంలో సుమారు 200 ఎకరాల్లో పొలం కోసిన పనలు మడుల్లో ఉన్నట్లు సమాచారం. కశింకోట, వెదురుపర్తి, బయ్యవరం, గొబ్బూరు, నూతలగుంటపాలెం, ఏనుగుతుని, నరసింగబిల్లి, తేగాడ, ఏఎస్ పేట, సోమవరం తదితర గ్రామాల్లో ఇటువంటి పరిస్థితి నెలకొని ఉంది. అయితే కోత కోయని పంట, కోత కోసి కుప్పలు పెట్టుకున్న వాటికి వర్షాల వల్ల పెద్దగా నష్టం ఉండబోదని, మడుల్లో పనలు నీటిలో మునిగి తడవడం వల్ల మూడు, నాలుగు రోజుల్లో మొలకలు వచ్చే అవకాశం ఉందని మండల వ్యవసాయ అధికారి ఎం.స్వప్న తెలిపారు. దీనిదృష్ట్యా మడుల్లో నీరు లేకుండా తొలగించుకోవాలని, లీటరుకు 5 గ్రాముల వంతున ఉప్పు కలిపిన ద్రావణాన్ని వరి పనలపై ధాన్యం తడిచేలా పోయాలన్నారు. ఎకరం పొలానికి 200 లీటర్ల ద్రావణం పోయాల్సి ఉంటుందని, అవకాశం లేకపోతే కళ్లు ఉప్పునైనా పనల వెన్నులపై జల్లాలని సూచించారు.

వేడుకగా గౌరీపరమేశ్వరుల ఊంజల్ సేవ

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీ పంచాయతన దేవస్థానంలో గౌరీపరమేశ్వరుల 199వ ఊంజల్ సేవా కార్యక్రమాన్ని శుక్రవారం ఆలయ అర్చకులు అంపోలు గోపాలకృష్ణశర్మ, పొందూరు సూర్యానారాయణశాస్త్రి, శేషు, సాయి నిర్వహించారు. ఈ సేవా కార్యక్రమాన్ని ఆళ్ల వెంకట సత్యప్రసాద్, నర్సింగరావు, మోహన్‌శంకర్ దంపతులచే నిర్వహించారు. అనంతరం సత్తెమ్మ తల్లి దేవస్థానం మహిళా మండలి, గౌరీపరమేశ్వరి అమృత వర్షిణి వ్యవస్థాకురాలు పెతకంశెట్టి సుజాత ఆధ్వర్యంలో ఆలయం వద్ద కోలాటం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



గౌరీపరమేశ్వరుల ఊంజల్ సేవ నిర్వహిస్తున్న వెంకట సత్యప్రసాద్ కుటుంబ సభ్యులు, అర్చకులు